క్లుప్తంగా

జ్ఞానాపురంలో క్రిస్మస్ దీపారాధన



ప్రత్యేక ప్రార్థనలో భక్తులు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పునీత పేతురు చర్చి, పారిస్ పాస్టిల్ కౌన్సిల్స్ (పీపీసీ) సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 4 గంటలకు కొవ్వొత్తులతో పలువీధుల్లో ప్రదక్షిణలు చేశారు. సెబాస్టియన్ కాలనీ, గెడ్డవీధి, కొండవీధిలో ఏర్పాటు చేసిన ప్రార్థనల్లో చర్చి ఫాదర్ రెవరెండ్ జాన్ ప్రకాష్ పూజలు ప్రారంభించి మాట్లాడారు. నవదిన ప్రార్థనలు 24 ఆదివారంతో ముగుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో పీపీసీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా న్యూహోప్ ఫౌండేషన్ వార్షికోత్సవం



సేవా రంగ ప్రముఖులను సత్కరిస్తున్న అతిథులు

దాబాగార్డెన్స్ : న్యూహోప్ ఫౌండేషన్ వార్షికోత్సవం బుధవారం నగరంలోని ఓ హోటల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కళా, సాహితీ, జర్నలిజం, సేవారంగాల్లో సేవలందించిన ప్రముఖులను ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు మంచా నాగమల్లేశ్వరి నేతృత్వంలో సత్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్ మాట్లాడుతూ ప్రతి ఏటా న్యూహోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమాజ సేవలో ఉన్న పలువుర్ని గుర్తించి సత్కరించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. నాగమల్లేశ్వరి మాట్లాడుతూ అందరి సహకారంతోనే ఇటువంటి కార్యక్రమాలు ప్రతి ఏటా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. విశాఖ జిల్లా వ్యవసాయశాఖ అడ్వైజరీ కమిటీ చైర్మన్ రామారావు, రంగా మోహన్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన బోట్లు వెలికితీత

అల్లిపురం : ఫిషింగ్ హార్బర్‌లో మునిగిపోయిన బోట్లను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ క్రేన్ల సహాయంతో పోర్టు అధికారుల సహకారంతో వెలికి తీయించారు. ఇప్పటికే 80 శాతం నష్ట పరిహారం చెల్లించినప్పటికీ, బోట్లు వెలికితీయాలని బాధితులు ఎమ్మెల్యేను కోరారు. ఈ మేరకు స్పందించిన ఆయన పోర్టు అధికారులతో మాట్లాడి మునిగిన బోట్లను వెలికి తీయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టపరిహారం అందించినప్పటికీ చిన్న చిన్న సమస్యలతో ఇంకా అవస్థలు పడుతున్న మత్స్యకారులకు సహాయం అందించేందుకు ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, మత్స్యకార నాయకులు, వార్డు అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్లు, కాలువ పనులకు శంకుస్థాపన

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డు పలు కాలనీల్లో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. రూ.46 లక్షల జీవీఎంసీ నిధులతో బాలాజీనగర్‌లో కాలువలు, రాజీవ్‌నగర్, స్వామి వివేకానందనగర్‌లో తారు రోడ్ల నిర్మాణం కోసం బుధవారం మేయర్ గొలగాని హరివెంకట కుమారి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డులో అన్ని కాలనీల్లోనూ పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో కొత్తగా యూపీహెచ్‌సీ అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ఇక్కడ గెడ్డ ఆధునీకరించామన్నారు. బాలాజీనగ్‌లో రూ.15 లక్షలతో కాలువలు, రాజీవ్‌నగర్‌లో రూ.15 లక్షలతో బీటీ రోడ్లు, స్వామి వివేకానందనగర్‌లో రూ.16 లక్షలతో బీటీ రోడ్ల నిర్మాణం ప్రారంభించినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



కొత్త సొబగులు

షాదీఖానా, మత్స్యకార సామాజిక భవనాలకు కొత్తరూపు

ప్రభుత్వ పనితీరుపై పాతనగర వాసుల ప్రశంసలు

ఇది కదా అభివృద్ధి



షాదీఖానాలో నిర్మించిన మరుగుదొడ్లు



వన్‌టౌన్‌లోని ముస్లిం షాదీఖానా

జగదాంబ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పాతనగరం కొత్త సొబగులు సంతరించుకుంటోంది. గత ప్రభుత్వాలు కనీసం మరమ్మతులకు కూడా నిధులు వెచ్చించకపోవడంతో ఇక్కడ అభివృద్ధి జరగలేదు. జీవీఎంసీ 39వ వార్డులోని లక్ష్మీ టాకీస్ వద్ద చాలా ఏళ్లుగా ఓ భవనం మూలకు చేరుకుంది. దీంతో అందులో కొందరు ఆకతాయిలు మద్యం సేవించడం, జూదమాడటం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతుండేవారు. ప్రశ్నిస్తే తగాదాలకు వస్తున్నారని వాపోయేవారు.

మత్స్యకార సామాజిక భవనంగా మార్పు..

వార్డులో వృథాగా ఉన్న భవనాన్ని మత్స్యకార సామాజిక భవనంగా మార్పు చేయడమే కాకుండా రూ. 19.7 లక్షల నిధులతో దానికి మరమ్మతులు చేశారు. అల్యూమినియం డోర్లు, విండోస్, మరుగుదొడ్లు, శ్లాబ్, విద్యుత్ సౌకర్యం, వాటర్ ట్యాంక్, టైల్స్ వంటి అధునాతన హంగులు అమర్చి మత్స్యకారులకు అందజేశారు. దీంతో ఆ వర్గం



లక్ష్మీటాకీస్ వద్ద ఉన్న మత్స్యకార సామాజిక భవనం

ప్రజలు దానిని శుభ కార్యాలకు ఉపయోగించుకుంటున్నారు.

షాదీఖానాకు మౌలిక సదుపాయలు

పాతనగరంలో ముస్లిం సామాజికవర్గం ప్రజలు అధికంగా ఉంటారు. ఇక్కడి షాదీఖానాను గత పాలకులు పూర్తిగా విస్మరించడంతో అది దాదాపు శిథిలావస్థకు చేరుకుంది. మరో అవకాశం లేక దానినే అక్కడి వారు వినియోగించేవారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాతనగరంలోని ముస్లింల అవసరాలు గుర్తించి షాదీఖానా అభివృద్ధికి చర్యలు తీసుకుంది. రూ. 1.25 కోట్ల నిదులతో షాదీఖానాకు మరమ్మతులు, తాగునీరు, పెయింటింగ్‌లు, మరుగుదొడ్లు, లైటింగ్, ఫుట్‌పాత్, టైల్స్ వంటి హంగులు అమర్చింది. దీంతో పాతనగరం ముస్లింలు షాదీఖానాను వినియోగించుకుంటున్నారు.

మత్స్యకార భవనం.. షాదీఖానా అభివృద్ధి ఇలా..

- రూ. 1.25 కోట్లతో షాదీఖానాకు మరమ్మతులు
- రూ. 19.7 లక్షలతో మత్స్యకార భవనానికి మరమ్మతులు

అడగ్గానే ఇచ్చారు..



మత్స్యకార భవనం కోసం ఎన్నో ఏళ్లుగా తిరుగుతున్నాం. గత ప్రభుత్వంలో కట్టిస్తామన్నారు. కానీ అది జరగలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వార్డులో ఉన్న భవనం ఇవ్వడమే కాకుండా దానికి మరమ్మతులు చేశారు. మత్స్యకార సామాజిక భవనం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమయింది.

–దూడ కృష్ణారావు, పాతనగరం, జీవీఎంసీ 39వ వార్డు

ప్రభుత్వానికి కృతజ్ఞతలు..



పాతనగరంలో ముస్లింలకు సామాజిక భవనాలు లేక ఇబ్బంది పడేవాళ్లం. జగనన్న ప్రభుత్వం షాదీఖానా అందుబాటులోకి తీసుకురావడంతో ఏ శుభ కార్యమైనా ఇక్కడే జరుపుకుంటున్నాం. ప్రభుత్వానికి ముస్లింల తరఫున కృతజ్ఞతలు.

–రహ్మతుల్లా బేగం, వన్‌టౌన్, 39వ వార్డు

పాతనగరానికి పూర్వవైభవం..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పాతనగరానికి పూర్వవైభవం వచ్చింది. నాలుగేళ్ల కాలంలో యాభై శాతం కంటే ఎక్కువగా ఇక్కడ అభివృద్ధి చేసాం. మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తాం.

– సబీరా బేగం, కార్పొరేషన్ డైరెక్టర్, జీవీఎంసీ 39వ వార్డు

సీఎం పేరిట సేవా కార్యక్రమాలు



పేదలకు చీరలు అందజేస్తున్న శ్రీవత్సవ్ సంస్థ సభ్యులు



వృద్ధులకు పండ్లు, రొట్టెలు అందజేస్తున్న బీసీ సెల్ అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్

దాబాగార్డెన్స్ : బడుగు బలహీన వర్గాల నేత, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కువైట్‌లో ఉపాధి పొందుతున్న నగరానికి చెందిన వేగి రామకృష్ణ బుధవారం నగరంలోని పాతపోస్టాఫీస్ సమీపాన గల స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో వృద్ధులకు అన్న సమారాధన నిర్వహించారు. పలువురు పేదలకు వైఎస్సార్‌సీపీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ చేతుల మీదుగా చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ ఫోన్‌లో తన అభిప్రాయం వెల్లడించారు. తండ్రి ఆశయాల సాధనకు నిరంతరం కృషి చేస్తున్న గొప్ప వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఆయన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని స్నేహితుల ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సభ్యులు, కాళ్ల సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు, రొట్టెల పంపిణీ..

పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్ నేతృత్వంలో జిల్లా పరిషత్ సమీపాన గల అమెరికన్ ఓల్డేజ్ హోమ్‌లో ఆశ్రయం పొందుతున్న పలువురు వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు. కేక్ కట్ చేసి తినిపించారు. కార్యక్రమంలో బొండాడ వెంకట్రావు, బీసీహెచ్ అప్పారావు, మామిడి మోహన్, రామిశెట్టి కిరణ్, ఇళ్లపు శ్రీను, అంగటి సురేష్, పీతల శేఖర్, ఆకుల సునీల్, మాణిక్యం శ్రీనివాస్, మజ్జి అప్పలరాజు, రమణ, కన్నబాబు, రాజేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : నియోజకవర్గంలో ప్రజలు తమ సమస్యలు చెబితే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. క్షేత్ర పర్యటనలో భాగంగా 29వ వార్డు పరిధి దండుబజారు, భుజంగరావుపేట, రామజోగిపేట తదితర ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. ఈ పర్యటనలో స్థానికులు తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. వాటిని అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అందరూ ఆనందంగా ఉండాలన్నారు. వార్డు అధ్యక్షులు, పార్టీ నాయకులు, జేసీఎస్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, జీవీఎంసీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లలితా పీఠంలో పాశుర విన్నపం

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠంలో ధనుర్మాస వ్రత మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా బుధవారం ఐదో రోజు పాశుర విన్నపం జరిగింది. ఈ సందర్భంగా గోదాదేవికి పంచామృతాభిషేకం, వెంకటేశ్వరస్వామి, అమ్మవార్లకు అర్చన, బాలభోగ నివేదన నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఈ నెల 23న ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తున్నట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కంటెంట్‌తో మెరుగ్గా బోధన



కప్పరాడ స్కూల్‌లో విద్యార్థినితో మాట్లాడుతున్న విద్యా శాఖ కమిషనర్ సురేష్‌కుమార్

కంచరపాలెం: ఐఎఫ్‌పీ ప్యానల్స్, బైజూస్ కంటెంట్‌ను వినియోగించుకుంటూ విద్యార్థులకు పాఠాలు బోధించాలని ఉపాధ్యాయులకు కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, ఐఏఎస్ అధికారి సురేష్‌కుమార్ సూచించారు. ఐటీఐ కూడలిలోని కప్పరాడ జీవీఎంసీ హైస్కూల్‌ను బుధవారం ఆయన సందర్శించారు. వివిధ సబ్జెక్టులపై విద్యార్థుల విషయ పరిజ్ఞానం, ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించారు. తరగతుల్లో ఐఎఫ్‌పీ ప్యానల్ బోర్డుల వాడకం, బైజూస్ కంటెంట్‌ను వినియోగించుకుంటూ జరుగుతున్న బోధన తీరును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు విద్యా లక్ష్యాల సాధనకు తగు సూచనలిచ్చారు.

- కప్పరాడ ప్రాథమిక పాఠశాలలో బాల్యం కేంద్రాన్ని ఐఏఎస్ అధికారి సురేష్‌కుమార్ సందర్శించి, విద్యార్థులతో ఆల్ఫాబెట్స్ రాయించారు. ఒకటో తరగతి విద్యార్థుల చేత వ్యక్తిగతంగా కూడికలు చేయించారు. ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించి తగు సూచనలిచ్చారు. ఉపాధ్యాయుల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు చేపట్టాలని జిల్లా విద్యా శాఖాధికారి చంద్రకళకు ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీసీ శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపాల్ విజయమాలిని తదితరులు పాల్గొన్నారు.


కనకమహాలక్ష్మికి పోటెత్తిన భక్తులు



దాబాగార్డెన్స్ : మార్గశిర మాసోత్సవాలు 7వ రోజు బుధవారం కనకమహాలక్ష్మి అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఉదయం 5 నుంచి పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన, సర్వదర్శనం, అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

23న ఉత్తర ద్వార దర్శనం

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రసన్న వేంకటేశ్వరుడికి ప్రధాన అర్చకుడు రాజాస్వామి బృందం చే ప్రత్యేక పూజలు చేశారు. కాలభైరవ జన్మనక్షత్రం సందర్భంగా భక్తులు నెయ్యి దీపాలు వెలిగించారు. ఆలయ ఈవో పైలా శేఖర్‌బాబు మాట్లాడుతూ ఈ నెల 23న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తున్నట్లు తెలిపారు.



ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



కొత్త ఆరోగ్యశ్రీ కార్డులు అందజేస్తున్న శ్రీహరిరెడ్డి తదితరులు

అల్లిపురం : రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు కొత్తగా ఆరోగ్య శ్రీ కార్డులు మంజూరు చేసింది. వాటిని సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అందజేస్తున్నారు. దీంట్లో భాగంగా బుధవారం కుమ్మరవీధి సచివాలయం పరిధిలో గల ఆరోగ్య శ్రీ లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు పాల శ్రీహరిరెడ్డి, ఇన్‌చార్జి ఏఎన్‌ఎం సుభాషిణి, వలంటీర్ కనకదుర్గ, ఆశ వర్కర్ పార్వతి పాల్గొన్నారు.

ఉపకరణాలకు 300 మంది దివ్యాంగుల దరఖాస్తు



దివ్యాంగుడిని పరిశీలిస్తున్న సిబ్బంది

సీతంపేట: దివ్యాంగులు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని బీజేపీ పార్వతీపురం ఇన్‌చార్జి ఎస్.వి.ఎస్.ప్రకాష్‌రెడ్డి ఆకాంక్షించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఆలీముకో జిల్లా యంత్రాంగం, రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహరావు ఆధ్వర్యంలో బుధవారం స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రధాని మోదీ ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తున్నారన్నారు. సుమారు 300 మంది దివ్యాంగులు ఉపకరణాల కోసం దరఖాస్తు చేశారు. వారికి ఆరు నుంచి 8 వారాల్లో ఉపకరణాలు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నగర అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, పుట్ట గంగయ్య, రామ్‌కుమార్, దానేష్, దుర్గరాజు, జోన్–3 కమిషనర్ విజయలక్ష్మి, ఏపీడీ దుర్గాప్రసాద్, కో ఆర్డినేటర్ రూపాకుల రవికుమార్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా వనభోజనాలు



ప్రజలకు భోజనం వడ్డిస్తున్న పూర్ణిమ, శ్రీధర్

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ నేతృత్వంలో వార్డు ప్రజలకు బుధవారం వనభోజన కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు శృంగవరపుకోట పుణ్యగిరికి వార్డు నుంచి 15 బస్సుల్లో విహారయాత్రకు వెళ్లి వనభోజన సందడి చేశారు. ఈ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ ప్రజలకు మేలు చేసేందుకు కృషి చేస్తానన్నారు. సుమారు 2వేల మందికి వనభోజనాలు ఏర్పాటు చేసి, ప్రత్యేక బహుమతులు అందజేశారు.

'అందరి నోట ఘంటసాల పాట' రేపు

బీచ్ రోడ్డు: సినీ గాయకుడు ఘంటసాల 101వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం అందరి నోట ఘంటసాల పాట పేరుతో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు ఘంటసాల, అమ్మజమ్మ ట్రస్ట్‌ల అధ్యక్షుడు ఎస్.ఎస్.కె.మహంతి తెలిపారు. ఈ మేరకు బుధవారం రామ్‌నగర్‌లోని తర కార్యాలయంలో పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శుక్రవారం సాయంత్రం 6 గంటలకు డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సంగీత విభావరి జరగనుందన్నారు. ప్రముఖ గాయకులు పీవీ రమణ, కె.రాజేంద్రప్రసాద్, బి.ఫణిభూషణ్, కె.ఎస్.ప్రకాష్, కల్యాణి, శ్రీవిద్య, మంగవేణి, తదితరులు మధుర గీతాలు ఆలపించనున్నారన్నారు. తొలి చిత్రం ఉపేంద్రగాడి అడ్డాతో గుర్తింపు పొందిన కంచర్ల ఉపేంద్రబాబును కళా పురస్కారంతో సన్మానించనున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు చెన్నా తిరుమలరావు, రాజు పాల్గొన్నారు.

